# రాబందులు

* రచన : 'రాపాకి' *

రాజ్యంలో రాబందులు అనే చలన చిత్రము కాదు. మా వూళ్ళోని రాబందులు; అలాగే ప్రతి వూళ్ళో రాబందులుంటాయి, శబ్దార్థానికి విహంగమైనా, నరులలో భూచర రాబంధులు. మానవుల్ని (మానవత్వంగల వారు) పీక్కు తింటూంటాయి. వర్తక రూపంలో, వ్యవహార రూపంలో అధికార దురహంకార పూరిత రూపంలో పీడించి, మనుష్యులమనే మాట మరచిపోయి, పశుత్వం కాక, పరమ పైశాచికత్వ ప్రపీడిత వృద్ధిర రాబందుల కథ కాదు కథానిక.

"తెలుగు మాష్టారు!"

"ఎవరు?"

"వాడా! పంతులు"

"వెంటనే పంచాయితీ ఆఫీసుకి పిలించండి!"

"ఒరే అప్పయ్యా! ఆ పంతుల్ని మేం అర్జంటుగా రమ్మన్నమన్నామని పిలువ్!

"సిత్తం."

"బాబూ!"

"ఎవరు?"

"నేనూ, అప్పాయిని."

"ఏంరా!"

"మిమ్మల్ని దొరబాబుగారు అర్జంటుగా పంచాయితీ ఆఫీసుకి రమ్మనమన్నారు."

"ఎందుకు?"

"ఎందుకో బాబూ! నాకు తెలీదు."

"సరే పద పోదాం."

"నమస్కారమండీ!"

"నమస్కారం, నమస్కారం."

"ఎందుకో రమ్మనమన్నారట నన్ను?"

"మీరీ వూరునుండి వెంటనే వెళ్ళిపోవాలి.

"అదేమిటలా అంటున్నారు!"

"మీరల్లో ఓ పిల్ల బ్రతుకు చెడింది" అంటూ పంచాయితీ అరుగు మీద కూర్చున్న పెద్దమనిషి అంటూండగా ... కొడకా! అంటూ దవడమీద ఛెళ్ళుమని లెంప కాయకొట్టాడు మరో యువకుడు. ఒకడు తిడుతున్నాడు. మరొకడు కొడుతున్నాడు. అది ఉదయం 8 గంటల వేళ. బస్సుల స్టాండు, జనం వింతగా చూస్తున్నారు. ఏమీ పాలుపోలేదు తెలుగు మాస్టారికి. అర్థం కాలేదు. అగమ్యంగా వుంది. అసహాయుడై నివ్వెరపోయాడు. ఓ ఉత్తరం చూపించారు. అందులో తనకు మాన భంగం చేశాడనీ ఆ అవమానం భరించలేక నూతిలోకి గంతానని వ్రాసిందో విద్యార్థిని.

అప్పటికా అవమానాన్ని దిగమింగుకొని, ఎలాగో క్రూర పులుల బారినుండి తప్పించుకున్నాడు. స్కూల్లోకి వెళ్ళేసరికి గప్పున యీ సంగతి వూరంతా వ్యాపించింది.

తీరా 'ఎంక్వయిరీ' చేస్తే ఇదివరకొక రోజు ఆ పిల్ల తన ప్రియుడికి ప్రేమ లేఖలు వ్రాస్తూండగా నల్గురిలో మాష్టారు మందలించాడనీ ఆ అవమానం భరించలేక ఆ పిల్ల యిలా చేసిందని అందరికీ తెల్సిపోయింది. ఆ పిల్లకూడా నూతి లోపలికి దిగలేదని కూడా తెల్సింది. బలి చేయించాలని ప్రయత్నించినా "ఛైర్మన్" గారికి కూడా యిదంతా కల్పిత కథని, యీ తెర వెనుక ఏదో భాగోతం వుందనీ, తతంగానికి తతంగాల కథ అని బోధపడింది.

ఊళ్ళో...ఆ రోజు అశేష ప్రజానీకానికి సమ్మోహనాస్త్రం వేసినట్లయింది. వాడికలాగే కావాలని కొందరూ పరిపరి విధాల పరిహాసాలాడజొచ్చారు. తర్వాత అయ్యో పాపం అన్నారు. మహాగ్నిహోత్ర మధ్య వారుణాస్త్ర ప్రయోగంలా "దాను" గారు "శ్రద్ధాంజలి" నందించారు. చప్పున చల్లారింది. రాబందు లెగిరిపోయాయ్.